క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమమని తహసీల్దార్ పబ్బారి శంకరబాబు సోమవారం తెలిపారు. పరిటాలలో రోడ్డును పూడ్చివేశారని తిరిగి రహదారిపై రాకపోకలు సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఒక అర్జీ వచ్చిందన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు కావాలని రెండు, డ్రెయినేజీలో మురుగు పారుదల అయ్యేలా చూడాలని మరో అర్జీ వచ్చిందని తెలిపారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖ అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలశంకర రావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఎం కోట భాస్కరరావు, ఏఓ కె.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్ పట్టాల పంపిణీ



సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు లబ్ధిదారులకు ఓటీఎస్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బి.ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం అన్నారు. గ్రామస్తుడు చింతా బుజ్జి అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం వైఎస్సార్ బీమా కింద తక్షణం మట్టి ఖర్చులకు మంజూరైన రూ.10 వేలను బుజ్జి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్మియా, ఆలయ డైరెక్టర్ కోలా రామారావు, నాయకులు గంగూరి గోపి, దోసపాటి దానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో గ్రామాభివృద్ధి



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని సర్పంచ్ జ్యోతిబ్రహ్మం కోరారు. గ్రామంలోని వైఎస్సార్ కాలనీలో డ్రెయినేజీ ఏర్పాటుకు సోమవారం సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం పనులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కాలనీలో డ్రెయినేజీ సమస్య ఎప్పటి నుంచో ఉందని కాలువతో పాటు అవసరమైన చోట తూములు ఏర్పాటు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, నాయకులు గంగూరి గోపి, దోసపాటి దానయ్య, దోసపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కిసాన్ శ్రామిక్ సత్సంగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రైతులకు అండగా కిసాన్ శ్రామిక్ సత్సంగ్ పని చేయడం అభినందనీయమని సర్కిల్ ఇన్స్పెక్టర్ గురునాయుడు అన్నారు. స్థానిక దుర్గాపురం వాకర్స్‌క్లబ్‌లో సోమవారం కిసాన్ శ్రామిక్ సత్సంగ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన సన్నకారు రైతులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతుల వల్లే నేడు మనం కడుపునిండా భోజనం చేయగలుగుతున్నామని రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. అనంతరం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు భార్యతో పాటు మరో 10 మంది నిరుపేద సన్నకారు రైతులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుర్నాథం, ఫణి, సీహెచ్ కోటేశ్వరరావు, మండా రాము, వై.రామకృష్ణప్రసాద్ మహమ్మద్ జానీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

జి.కొండూరు: నాడు–నేడు కింద జరుగుతున్న పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ అనురాధ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ సిబ్బంది, హెచ్ఎంలు, సీఆర్పీలు, ఎంఈఓలతో సమీక్ష సమావేశాన్ని ఎంపీడీఓ సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్కూలు డ్రాప్ అవుట్స్‌పై దృష్టి సారించాలని కోరారు. ఎంఈఓలు వీరాస్వామి, వెంకటనర్సింహారావు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోండి

'పేట' కౌన్సిల్‌లో చైర్మన్ రాఘవేంద్ర



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



అక్రమ లేఅవుట్లను చూపిస్తున్న కౌన్సిలర్ మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: మునిసిపాలిటీ స్థలాలను ఆక్రమించి వాటిలో అక్రమంగా లే అవుట్లు ఏర్పాటు చేస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. మునిసిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్లో సోమవారం చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ముందుగా కౌన్సిల్ సీసీ తాజుద్దీన్ ఎజెండాలోని అంశాలను వినిపించారు.

అక్రమ లేఅవుట్లతో మునిసిపాలిటీకి రూ.6 కోట్ల నష్టం

పట్టణంలో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో అక్రమ లే అవుట్లు నడుస్తున్నాయని పాలకవర్గ సభ్యుడు వట్టెం మనోహర్ తెలిపారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో మునిసిపాలిటీకి రావాల్సిన సుమారు రూ.6 కోట్ల ఆదాయం కోల్పోయిందన్నారు. 31వ వార్డులో మూడు మునిసిపాలిటీ ప్లాట్లు కబ్జాకు గురవుతున్నా, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని చైర్మన్‌కు తెలిపారు.

జాతీయ రహదారి పక్కన సర్వే నెం 102,103,104,105లో ఐదు ఎకరాల మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి అక్రమ లేఅవుట్ వేశారని, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, డీఈ, ఏఈలు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర.. కమిషనర్ నాగమల్లేశ్వరరావును వివరణ కోరారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కొరతతో జాప్యం జరుగుతుందని, అందరికీ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

అధికారులపై మున్సిపల్ డీఎంఏకు ఫిర్యాదు చేస్తాం: చైర్మన్

మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల యజమానులకు కూడా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎంతమందికి నోటీసులు ఇచ్చారో చెప్పాలని చైర్మన్ అన్నారు. మునిసిపల్ డీఈ, ఏఈల పనితీరు సంతృప్తి కరంగా లేదని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్‌కు సూచించారు. మున్సిపల్ డీఎంఏకు ఫిర్యాదు చేస్తామని చైర్మన్ హెచ్చరించారు.

■ ప్రతిపక్ష సభ్యుడు పేరం సైదేశ్వరరావు మాట్లాడుతూ పాత మున్సిపల్ కార్యాలయంలో స్థలాన్ని ఆక్రమించారని, దీనిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ 31 మంది కౌన్సిలర్లు పార్టీలకు అతీతంగా అక్రమ లేఅవుట్ల వద్దకు వెళ్లి విచారణ చేద్దామన్నారు. పాత మున్సిపల్ కార్యాలయ స్థల ఆక్రమణదారునిపై కూడ 10 రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే టీడీపీ విధానం: వైస్ చైర్మన్

ప్రతిపక్ష సభ్యురాలు కె.రామలక్ష్మి చెరువు అభివృద్ధి, జగనన్న కాలనీలో ఎల్‌పీ–2 లో గ్రావెల్ రోడ్డు నిర్మాణం అంచనాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా చెరువును అభివృద్ధి చేయడంపై ప్రతిపక్ష సభ్యులు హర్షం వ్యక్తం చేయాల్సింది పోయి, అడుగడుగున అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధిని అడ్డుకోవడమే టీడీపీ విధానమని చెప్పారు. దీనిపై చైర్మన్ వివరణ ఇస్తూ చెరువు అభివృద్ధిలో ఇరిగేషన్ అధికారుల సూచన మేరకు అర్జంటుగా నీరు బయటకు పంపేందుకు పైప్ కల్వర్టు నిర్మించాల్సి వచ్చిందని, జగనన్న కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంతో ముందుగా రోడ్డు నిర్మించాల్సి వచ్చిందన్నారు.

■ ప్రతిపక్ష సభ్యులు రామలక్ష్మి, వెంకట్ మాట్లాడుతూ 9వ వార్డులో మున్సిపల్ స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అత్యధికంగా రూ 8.72 లక్షలు కేటాయించడంపై ప్రశ్నించారు. చైర్మన్ వివరణ ఇస్తూ దీనిపై ప్రభుత్వ అధికారులు డిటైల్డ్‌గా అంచనాలు తయారుచేసినట్లు తెలిపారు.

■ పాలకవర్గ సభ్యుడు పందుల రోశయ్య మాట్లాడుతూ పనులు మొదలు పెట్టని వారికి కాంట్రాక్టు పనులు ఇవ్వవద్దని, వారిని తొలగించి వేరే వారికి ఇవ్వాలన్నారు. దీనిపై పనులు మొదలు పెట్టకుండా జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని డీఈ, ఏఈలను ఆదేశించారు.

80 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

పలువురు సభ్యులు సమస్యలపై చర్చించారు. అనంతరం ఏజెండాలోని 80 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్ మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ హఫీజున్నీసా, 8వ వార్డు కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో సోమవారం స్థానిక 2 వ వార్డు, 23వ వార్డుల్లో సీసీ రోడ్లు, కాకానినగర్‌లోని గ్రంథాలయంగోడ నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ శంకుస్థాపన చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్లు కొలగాని రాము, రమాదేవి రామకృష్ణ, మనోహర్, రోశయ్య పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల పునఃప్రారంభం

కంచికచర్ల: మూతపడిన ఉర్దూ పాఠశాలను తిరిగి సోమవారం తెరిచారు. మండలంలోని పరిటాలలో 50 ఏళ్ల నుంచి ఉర్దూ పాఠశాల నడుస్తోంది. ఇటీవల విద్యాశాఖ అధికారులు ఆ స్కూల్‌ను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. ఎక్కువ మంది ముస్లింలు ఉన్నారని ఉర్దూ పాఠశాల ప్రత్యేకంగా ఉండాలని గ్రామస్తులు పట్టుబడటంతో విద్యాశాఖాధికారి బాలాజీ తిరిగి ఉపాధ్యాయురాలిని నియమించి విద్యార్థులు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

సామాజిక న్యాయం సీఎం ఆశయం

'గడప గడప'లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వీరులపాడు గడపగడపలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని దానికనుగుణంగా పాలన చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని వీరులపాడులో సోమవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను అందజేశారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

సామాజిక న్యాయం దేశానికే ఆదర్శం..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవలంబిస్తున్న సామాజిక న్యాయం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఒక వర్గానికి కొమ్ము కాయకుండా సంక్షేమ ఫలాలను అన్ని వర్గాలకూ అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రతి ఒక్క సంక్షేమ పథకంలోను మహిళలను భాగస్వాములను చేస్తున్నారని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

నిరుపేదలకు అండగా..

నిరుపేదలకు.. సీఎం అండగా ఉంటున్నారని చెప్పారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

నందిగామ: విజయవాడకు చెందిన న్యాయవాది ఆదిశేషు విఠల్ బాబును దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు అన్నారు. న్యాయవాది హత్యకు నిరసనగా సోమవారం నందిగామలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రకాష్, నారాయణరావు, జీవరత్నం, సుబ్రహ్మణ్యం, దాదా హుస్సేన్, జవహర్, లక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రహదారి ఏర్పాటు



నందిగామ: ఇటీవల వరదల సమయంలో నందిగామ నుంచి మండలంలోని కంచల గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. నాలుగు రోజులుగా ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సోమవారం వరద నీరు కూడా కాస్త తగ్గుముఖం పట్టడంతో వైఎస్సార్ సీపీ నాయకుడు చలమల మధు సొంత ఖర్చుతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు.

మున్సిపల్ కమిషనర్‌నంటూ వ్యాపారులకు టోకరా !

పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

నందిగామ: 'నేను మున్సిపల్ కమిషనర్‌ను మాట్లాడుతున్నాను మీరు ట్రేడ్ లైసెన్స్ రూ.11,000 చెల్లించాలని. ఇప్పుడు కడితే రూ.1000 సరిపోతుందని నాకు ఫోన్‌పే చెయ్యండని పట్టణంలోని పలువురు వ్యాపారులకు టోకరా వేసిన ఘటన నందిగామలో చోటుచేసుకుంది. దీనిపై మోసపోయామని గుర్తించిన బాధిత వ్యాపారులు సోమవారం నందిగామ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాంకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఇలాంటి ఘటనలు స్థానికంగా చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వెంటనే స్పందించిన ఆయన స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సంబంధిత నంబర్లతో పాటు వ్యాపారులు ఇచ్చిన ఆధారాలను పోలీసులకు అందజేశారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులమంటూ ఎవరు ఫోన్ చేసినా నిర్ధారణ చేసుకోకుండా నగదు చెల్లించవద్దని విజ్ఞప్తి చేశారు.

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి



సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సోమవారం ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో 6వ వార్డు కాకానినగర్‌కు చెందిన ఉమ్మనేని నందన్ నరాల బలహీనత(జీబీఎస్ వ్యాధి)తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఉదయభాను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ 2 లక్షలు ముందస్తు వైద్యఖర్చుల నిమిత్తం(ఎల్‌వోసీ) మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎల్‌వోసీ పత్రాన్ని లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. మునిసిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బద్దూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలో వీరులపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ పాఠశాలలుగా మార్చి చిన్నారులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నారని చెప్పారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంలో భాగంగా రాగి జావ కూడా అందిస్తున్నారని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ భవనాలకు కొత్త భవనాలను మంజూరు చేసి కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించి బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, నాయకులు శీలం లక్ష్మీ ప్రసన్న, మండూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

తువ్వకాలువ గండ్ల పరిశీలన



గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మునేరు వరద కారణంగా తువ్వకాలువకు పడిన గండ్లను సోమవారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను రైతులతో కలిసి తువ్వకాలువను పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. దీనిపై ఇరిగేషన్ ఎస్ఈ టీజేహెచ్ ప్రసాద్‌బాబు, ఈఈ పి.గంగయ్య, డీఈ ఎస్. రామకృష్ణారావు, జేఈ ప్రసన్న లక్ష్మి కాలువను పోలంపల్లి డ్యామ్ వద్ద నుంచి మొత్తం పరిశీలించారు. గండ్లు పడిన ప్రాంతాలు, మరమ్మతులు అవసరమైన ప్రాంతాలను పరిశీలించి వివరాలు వెంటనే అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పనులు వెంటనే ప్రారంభిస్తామని వారు తెలిపారు.

నందిగామలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్



పారిశుద్ధ్య డ్రైవ్‌ను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ జయరాం

నందిగామ: వర్షాలు, వరదల నేపథ్యంలో పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 20వ వార్డు పరిధిలోని అనాసాగరంలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు జరిగాయి. వాటిని కమిషనర్ పరిశీలించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వరద బాధిత ప్రాంతాల్లో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జ్ రవీంద్ర, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విదేశీ విద్యా దీవెనతో పేదల కల సాకారం



ముసునూరు విద్యార్థి శ్రీహర్షను అభినందిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంతో పేదల కలలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు చెప్పారు. కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామానికి చెందిన విద్యార్థి సూర్యదేవర శ్రీహర్షకు విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా ఆర్థిక సహకారం అందటంతో స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే జగన్‌మోహనరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ న్యూయార్క్‌లోని విశ్వవిద్యాలయంలో చదుకునేందుకు శ్రీహర్షకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ. కోటి ఆర్థిక సహకారాన్ని అందించారన్నారు. అనంతరం శ్రీహర్షను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, రాయల నరసింహారావు, పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల వివరాలు సేకరణ



మాగల్లు ప్రాంతంలో కూరగాయల తోటను పరిశీలిస్తున్న హార్టీకల్చర్ అధికారి నీలిమ

నందిగామ: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న పలు రకాల కూరగాయల తోటలను సోమవారం ఉద్యాన శాఖ అధికారి నీలిమ పరిశీలించారు. మాగల్లు పరిసర ప్రాంతాల్లో సోమవారం పలు రకాల కూరగాయల తోటలను పరిశీలించారు. ఆమె రైతులకు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ వరదలకు దెబ్బతిన్న కూరగాయల తోటల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఖాసిం మండలంలోని అంబారుపేట, ఐతవరం ప్రాంతాల్లో వరదల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు.

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతి రోజూ క్రమం తప్పకుండా జిమ్‌కు వెళ్లడం, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. సింగ్‌నగర్–న్యూరాజరాజేశ్వరిపేట రోడ్డులోని హార్డ్‌కోర్ గడ్స్ జిమ్ ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెప్పిన మాట అక్షర సత్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిమ్‌కు వెళ్లడం, శరీర దారుఢ్యంపై ఆసక్తి చూపడంతో మద్యం, సిగరెట్లతో పాటు ఇతర చెడు వ్యసనాలకు దూరంగా జీవించవచ్చన్నారు. సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరిపేట పరిసర ప్రాంతాల్లోని యువత చెడు మార్గంలోకి ప్రయాణించకుండా ఇటువంటి జిమ్‌లు ఎంతో దోహదపడుతున్నాయని చెప్పారు. మిస్టర్ ఆంధ్ర ట్రోఫీ గ్రహీత బోళ్ల తిరువెంకట రాకేష్ మాట్లాడుతూ.. యువతకు బాడీ బిల్డింగ్‌పై మరింత ఆసక్తిని పెంచాలనే ఉద్దేశంతో తమ జిమ్ ఆధ్వర్యంలో ఏటా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. వయస్సు, బరువు ఆధారంగా యువతకు బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన మొదటి ముగ్గురికి బహుమతులు, ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో సుధీర్, మురళీ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజానికి రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని షేక్ రాజాసాహెబ్ హెల్త్ సెంటర్‌లో పేషెంట్లకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సోమవారం అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మరుపిళ్ల రాజేష్ మాట్లాడుతూ.. సమాజంలో వివిధ వర్గాలకు రోటరీ సంస్థలు విశేషమైన సేవలందిస్తున్నాయన్నారు. విద్యా, వైద్య రంగాలకు అందించే సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. క్లబ్ అధ్యక్షుడు బాయన బాబూజీ(బాబ్జీ) మాట్లాడుతూ.. హెల్త్ సెంటర్‌లోని పేషెంట్లకు హార్లిక్స్ 500 గ్రాముల ప్యాకెట్స్, బ్రెడ్ ప్యాకెట్స్, పసి పిల్లలకు మల్టీ విటమిన్, మల్టీ మినరల్ చుక్కల మందు సీసాలు కలిసి ఉన్న కిట్లను 300 మంది గర్భిణులకు, బాలింతలకు పండ్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమానికి సహకరించిన సహచర రోటరీయన్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గుండారపు శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ కార్యదర్శి మాలపాక భాస్కర్, క్లబ్ కోశాధికారి గణేష్ సుబ్బారావు, క్లబ్ ప్రముఖులు ముదిలి మోహనరావు, ఆర్‌వీ సుబ్బరాజు, షేక్ అమానుల్లా, యాంపాటి శ్రీనివాసరావు, రాజగిరి సోమేశ్వరరావు, వి.దామోదరరావు పాల్గొన్నారు.

దివ్యాంగుల గుర్తింపునకు ప్రశస్త్



కంచికచర్ల జెడ్పీ స్కూల్‌లో ప్రశస్త్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసిన ఉపాధ్యాయులు

కంచికచర్ల : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి వారి సమగ్ర వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ప్రశస్త్ యాప్‌ను రూపొందించిందని ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రశస్త్ యాప్‌ను ఉపాధ్యాయులతో డౌన్‌లోడ్ చేయించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు దివ్యాంగులను ప్రశస్త్ యాప్‌లో నమోదు చేసి స్క్రీనింగ్ ద్వారా సర్వేలో నమోదు చేయాలన్నారు. మండలంలో 400మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులున్నారని వారందరినీ యాప్‌లో రిజిస్టర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ ఇస్మాయేల్, శింగి రాజు, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.